విశ్వసాహితి ఉగాది కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# చుక్కలు

**అ**ప్పటికి సూర్యుడింకా తెల్ల చొక్కా తొడుక్కోలేదు.

అప్పారావు గబగబా చొక్కా తొడుక్కుంటూ వీధిలో పడ్డాడు కాఫీ అయినా తాక్కుండా. ఒకవేళ త్రాగే వెళదామన్నా కాఫీక్కావలసిన సరుకులేం లేవు ఇంట్లో. అయినా అదేం బాధపెట్టడం లేదు. తన ముందున్న హిమాలయాల్లాంటి సమస్యల ముందు అసలవి ఎన్నో వంతని? సూర్యుడి ముందు గుడ్డి దీపంలా కూడా వుండవు.

అతడికిప్పుడు యమర్జంటుగా ఎంతో కొంత డబ్బు కావాలి. అవసరాలు సవాలక్ష వున్నా, ఆ అవసరాల్లో అత్యంత అత్యవసరమైన అవసరార్థం అతడింత ప్రొద్దుటే పడుతూ లేస్తూ పోతున్నాడు.

నాలుగైదు నెలల క్రితం అప్పారావు ఒక శేఠ్ దగ్గర కాసెత్తు బంగారం గల భార్య నల్ల పూసలదండని ఒక అవసరార్థం తాకట్టు పెట్టాడు. అదే తాకట్టు మీద మరికొంత డబ్బివ్వమని బ్రతిమాలడానికి, అతడిస్తాడనే ఆశతో వెళ్తున్నాడు. కాస్త ప్రొద్దెక్కితే చాలు. ఆ శేఠ్ ఊరిమీద, ఆ పైన ఆఫీసుల మీదా పడతాడు బాకీ వసూళ్ళకి. అందుచేత అతడిల్లు వదలకుండానే అతడ్ని కల్సుకోవాలనే ఆ తొందర!

అతడింటి కెళ్ళాడు గాని ఎప్పట్లా అతడు అరుగు మీద పడక్కుర్చీలో కూర్చుని కన్పించలేదు. అతడితో పనుండి వచ్చిన వాళ్ళూ కన్పించలేదు. ఏమిటో ఈ వింత అనుకుంటూ పిలిచాడు అప్పారావు.

కొంచెంసేపటికి ఒకావిడ ఏదో నములుతూ వచ్చి "ఊరి కెళ్ళారు నాల్రోజుల వరకూ రారు" రోజూ వచ్చే ముష్టివాడిపై విసుక్కున్నట్టుగా అని నిర్లక్ష్యంగా వెనుదిరిగి వెళ్ళిపోయింది.

చాలా నీరసపడిపోయాడు అప్పారావు. అంతక్రితం కన్పించని ఆకలి అమాంతం త్రివిక్రముడై కూర్చుంది. అయినా నీరసంగా నడుస్తున్నాడు – ఆకలి గురించి కాకుండా డబ్బు గురించి తీవ్రంగా ఆలోచిస్తూ .

డబ్బెలా? ఇప్పుడెలా?

డబ్బులేక పోతే బియ్యం రాకపోతే ఇంట్లో అంతా పస్తే!

ఏడుపు రాబోయి ఆగిపోయింది.

త్వరగా ఆఫీసుకెళ్ళి ఎవర్నన్నా అప్పడిగితే సరి. అంత పెద్ద ఆఫీసులో ఒక్కడైనా పది రూపాయలన్నా ఇవ్వడూ? ఎందుకివ్వడు? తప్పకుండా ఇస్తాడు. ఇదివరకందరి దగ్గరా అప్పులు చేస్తే మాత్రం చాలా మందికి తిరిగి ఇచ్చెయ్యలేదూ? ఆ మాత్రం నమ్మకం వుండదేమిటి తనమీద గాని, ఇప్పుడు వట్టి చేతుల్తో ఇంటికెలా వెళ్ళడం?

అతడా ఆలోచనల్లోంచి బయటికి వచ్చి చూసేసరికి ఏముందీ అతడి కాళ్ళు దగ్గర దగ్గర అతడింటికి తీసుకొచ్చేశాయ్. తప్పదురా దేవుడా అనుకుంటూ ఇంట్లో కెళ్ళాడు.

"ఏరా" అప్పారావు తల్లి పిల్చింది.

ఆమెకదేదో పెద్ద జబ్బు. నాలుగు నెలల పైనుండే మంచం మీంచి లేవలేకుండా వుంది. ఆమెని చూసినప్పుడల్లా సరైన వైద్యం చేయించకుండా తనే రోజూ ఆమెని కొంచెం కొంచెం చంపేస్తున్నట్టు ఫీలవుతూంటాడు. బాధ పడుతూంటాడు. ఇవాళా అంతే చేశాడు. పైపెచ్చు ఈ మధ్య మరోటి కూడా అనుకుంటున్నాడు. బేసిక్ శాలరీలో డి.ఏ కలపడం గురించి చర్చలు జరుగుతున్నాయి. గనుక అవి ఫలిస్తాయనీ తప్పకుండా జీతం పెరుగుతుందనీ ఎర్రియర్స్ ఎలాగూ వస్తాయి గనుక, వాటితో తల్లి జబ్బు నయం చేయించాలనుకుంటూ తల్లి ప్రక్కన మంచం మీద కూర్చున్నాడు "ఏమ్మా" అంటూ.

"నేనింకెన్నాళ్ళో బతకన్రా – కన్ను మూసే ముందు అమ్మాయి కళ్యాణం చూసి పోదామనుందిరా"

ఆమె ఎంతో ఆశతో ఆవేదనతో ఆరాటంతో చెప్పింది. ఒక అసంభవమైన విషయం గురించి సరదాగా ఆమె చెబుతున్నట్లు, సరదాగా తాను వింటున్నట్లు చలన రహితంగా విన్నాడు అప్పారావు. లేకపోతే తను పొయ్యిమీద కుండెక్కించలేని తను, గుండెల మీది కుంపటి దించుకోగలడా?

"అలాగేనమ్మా" అన్నాడు కాని యథాప్రకారం లేవలేదు, ఆఫీసుకు టైమవుతోన్నా. ఇదే ఇదివరకైతే "అన్నం వుడికిందా" అంటూ వంటింట్లో కెళ్ళేవాడు. కాని ఇప్పుడెలా ఏ ముఖం పెట్టుకు నెళ్ళగలడు? భార్యకి తన మొఖం ఎలా చూపగలడు? అందుకే తలవంచుకుని కూర్చున్నాడు.

"భోజనానికి లేస్తారా?"

అమృతం త్రాగుతారా అన్నట్లన్పించి ఉలిక్కిపడి చూశాడు భార్య వంక.

ఆ చూపుల అర్థం గ్రహించిన ఆమె "పై వీధిలోని రామాయమ్మ శేరు బియ్యం అప్పిచ్చారు" అంది.

'హమ్మయ్య' అనుకుని లేచాడు.

అప్పారావు ఆఫీసుకెళ్ళ బోతూండగా అతడి తమ్ముడు "పరంధామయ్య గార్ని కల్సుకున్నావా?" అనడిగాడు.

"ఇవాళెళతాన్లే. అయినా నిన్ననేగా ఇంటర్వ్యూ అయ్యిందీ. అదేమన్నా గవర్నమెంటాఫీసనుకున్నావా? మరోటనుకున్నావా? త్వరగా తెమల్డానికి. అయినా సాయంత్రం వెళ్ళి కనుక్కుంటాన్లే"

పరంధామయ్యగారి వూసెత్తేసరికి అతడి మనస్సులో ఆనందంతో కూడిన కొత్తాశ గబగబా మొలకెత్తింది. 'ఆయన తప్పకుండా సాయం చేస్తాడు' అనుకున్నాడు పదిసార్లు.

పరంధామయ్యగారేం పెద్ద మంత్రి కాదు. యం.పీ. కాదు. ఆఖరికి యమ్మెల్యే కూడా కాదు. ఆయనా పెద్ద మున్సిపాలిటీలోని ఓ కౌన్సిలర్.

అతడేం చేయగలడు – అతడి వల్లేం అవుతుంది. ఒకవేళ అయ్యేట్లయితే నీకెందుకు చేస్తాడని ఎవరైనా అనగలరు. గాని అప్పారావు కలలో కూడా అనుకోలేడు. అతడి కంత నమ్మకం ఏర్పడిందాయన మీద. అవును మరి. మొన్నటి మున్సిపల్ ఎలక్షన్లో అతడూ అతడి తమ్ముడూ గొడ్డు చాకిరీయే చేశారు. తాము అడక్కుండానే "ఇంటర్వ్యూ తెచ్చుకో నీ తమ్ముడికి తప్పకుండా ఉద్యోగం వేయిస్తాను" అనే వాడాయన రోజుకి నాలుగైదు సార్లు. అటువంటాయన ఎలా చేయకుండా పోతాడని అప్పారావు అనుకుంటాడు?

తమ్ముడితో అన్నట్టే ఆ సాయంత్రం పరంధామయ్యగారింటికెళ్ళాడు. ఆయనెంతో ఆప్యాయంగా ఆహ్వానించి ఆతిధ్యమిచ్చి అన్నారు – "ఏమిటీ విషయం?"

"అదేనండి – మా తమ్ముడి ఇంటర్వ్యూ..."

"అవును వెళ్ళాడు కదూ. నేనివాళ ఆ ఆఫీసరుకు ఫోన్ చేస్తాలే, తప్పకుండా పనవుతుంది. వూఁ ఇంకేమిటి విశేషాలు?"

మరి కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడి సంతోషం, ఆశ నిండిన గుండెల్తో బయటపడ్డాడు అప్పారావు.

తప్పకుండా ఆయన హెల్ప్ చేస్తాడనుకున్నాడు మళ్ళీ మళ్ళీ. లేకపోతే ఎవరైనా ఇంటికొస్తే చాలు నుదురు చిట్లించే ఈ రోజుల్లో అంత ఆప్యాయంగా ఆహ్వానించి చల్లని డ్రింకిచ్చి తియ్యగా మాట్లాడాడంటే ఏమనుకోవాలి? తప్పకుండా అవుతుందనుకోవాలి ఏ విధమైన సందేహానికీ తావివ్వకుండా.

దారిలో సహోద్యోగి మధు ఎదురయ్యాడు. అతడంటే అప్పారావుకెంతో ఇష్టం. దానికో కారణం కూడా వుంది. మధు ఓ చిన్న రచయిత. పైపెచ్చు ఎన్నో గొప్ప భావాలున్నవాడు. వీటన్నిటినీ మించి బ్రహ్మచారి. అటువంటి అతడు కట్నం లేకుండా తన చెల్లెల్ని పెళ్ళి చేసుకుంటే...? చేసుకుంటాడని అతడి మనస్సు పదే పదే చెబుతూంటుంది అతణ్ని చూడగానే. అందుకే అతడంటే ప్రత్యేకమైన ఇష్టం!

"కాఫీ త్రాగుదాం రా" అందామనుకున్నాడు గాని జేబులు ఖాళీగా వుండటంతో

అనలేకపోయాడు. ఇంతలో అతడే అనేశాడు.

కాఫీ త్రాగి కొంచెంసేపు సరదాగా కబుర్లు చెప్పుకుని విడిపోయారు. కాని అతడి తలపులు అప్పారావుని వదల్లేదు.

అతడి మాటల్ని బట్టి తనంటే అభిమానము సానుభూతీ కూడా ఎక్కువ మోతాదులో వున్నట్టు స్పష్టమవుతోంది గనుక, తన చెల్లెల్ని పెళ్ళి చేసుకోమంటే తప్పకుండా చేసుకుంటాడు. కాని అలా తనడగటం బాగుండదు. మరెవరి చేతైనా అడిగించాలి. రేపో ఎల్లుండో అడిగిస్తాడు – అతడు ఒప్పుకుంటాడు – తన చెల్లెలి కాటుక కళ్ళల్లో వేయి కాంతులు – వెన్నెల జల్లులు...!

అప్పారావు మనస్సు దూదెకన్నా తేలికై పోయింది. అతడిలో ప్రవహిస్తోన్నది రక్తం గాక ఆనందంలా వుంది. అతడికి, అరిగి గోతులు పడ్డ రోడ్డూ, కూలిపోతున్న ఇళ్ళూ, మోడులైన మొక్కలూ అన్నీ ఎంతో సుందరంగా కన్పిస్తున్నాయ్.

ఇంకేముంది? తమ్ముడికి ఉద్యోగం వస్తుంది. చెల్లెలికి పెళ్లవుతుంది. జీతం పెరుగుతుంది. గనుక వచ్చే ఎర్రియర్స్‌తో అమ్మ ఆరోగ్యం బాగవుతుంది. తన జీతంతో బాటు తమ్ముడి జీతం కూడా కలుస్తుంది. గనుక ఇక డబ్బుకి ఇబ్బందుండదు. గబాగబా అప్పులన్నీ తీర్చేయాలి. తర్వాత కాస్త మంచి ఇంట్లోకి మారాలి. ఇప్పుడున్నది మరీ దారుణంగా వుంది. చుట్టూ రొచ్చూ దోమలూను! అలాగే ఇంట్లో వాళ్ళందరికీ కొత్త బట్టలు కుట్టిస్తాడు. అందరి ముఖాల్లో వెలుగు. ఇంట్లో వెలుగు. తృప్తిగా వెలిగే వెలుగు... అబ్బ! ఆ మంచి రోజులు తప్పకుండా రాబోతున్నాయ్. అవును. ఇదివరకో జ్యోతిష్కుడు చెప్పను కూడా చెప్పేడు. తనకు త్వరలోనే ఈ గడ్డుకాలం పోయి శుభ ఘడియలు వస్తాయని! నిజమే మరి, చీకటి తర్వాత వెలుగు తప్పని సరిగా రాదూ? తప్పకుండా వస్తుంది. వస్తుందా? వస్తుంది. ఈ శుభసూచనలే దానికి సాక్ష్యం!

చాలా హుషారుగా వున్నాడు అప్పారావు. చిన్నగా ఈల వేశాడు. ఎప్పుడూ లేనిది కిళ్ళీ వేసుకోవాలని, స్టైల్‌గా సిగరెట్టు కాలుస్తూ రోడ్డుమీది జనాన్ని చూడాలనీ, అప్సరాలో భోంచేసి మాంచి ఇంగ్లీషు పిక్చర్ కెళ్ళాలనీ అన్పించింది. దాన్ని బలవంతాన భవిష్యత్తులోకి వాయిదా వేశాడు.

అప్పారావు ఎంతగానో ఎదురు చూసిన డి.ఏ. మెర్జిడు శాలరీ వచ్చింది. సుమారు 20 రూపాయల జీతం మాత్రమే పెరిగింది. ఎర్రియర్సేం రాలేదు గాని పెరిగిన దాంట్లో సగం కంపల్సరీ డిపాజిట్ స్కీమ్‌లోకి వెళ్ళిపోయింది!

ఆ విషయం విన్న అప్పారావు నిలువెల్లా నీరసం ఆవరించింది. మనసు మనసులో లేకుండా పోయింది. మెల్లగా వెళ్ళి సీట్లో కూర్చున్నాడన్న మాటే గాని ఫైలు విప్పలేదు. పని చెయ్యాలనిపించలేదు.

మిగిలిన వాళ్ళు కూడా కమిటీ రికమండేషన్ల గురించే చర్చిస్తూ ఎంత జీతం పెరుగుతుందనే విషయమై తర్జన భర్జనలు పడుతున్నారు.

అయినా తనేదో ఇదైపోతున్నాడు గాని నెలనెలా సి.డి.యస్ క్రింద కట్ చేస్తున్న సొమ్ము ఆదాయే కదా. అదంతా మూడ్నాలుగు దఫాల్లో ఇస్తారు గనుక కొంచెం పెద్ద మొత్తమే వస్తుంది గనుక ఏదో దానికుపయోగించుకోవచ్చు – అని సర్ది చెప్పుకోవడంతో కొద్దో గొప్పో తేరుకున్నాడనే చెప్పాలి అప్పారావు.

లంచ్‌కి లేద్దామనుకుంటూండగా మధు వచ్చి శుభలేఖిచ్చి "మీరు తప్పకుండా మా మ్యారేజ్ కొచ్చి ఆశీర్వదించాలి..." అంటూ ఏదేదో అన్నాడు గాని ఆ తర్వాతి విషయాలేం అప్పారావుకి వినపళ్ళేదు...

యాంత్రికంగా పత్రిక విప్పి ఆతృతగా వధువు పేరు చూశాడు... 'చి.సౌ.శ్రీలక్ష్మి నిచ్చి...'

ఆమె తన చెల్లెలు కాదు!

తానెన్నో ఆశలు పెట్టుకుని ఆకాశహర్మ్యాలు నిర్మించుకున్నాడు. కాని ఆ మధు మరెవర్నో...!

ఎవరో అతడిలోని జీవపదార్థమంతా తీసేసినట్లుగా సర్వం కోల్పోయినట్లుగా దిగాలు పడి కూలబడిపోయాడు.

అయిపోయింది. అంతా అయిపోయింది. ఇంతవరకూ తనని ఆశపెట్టిన ఆశలన్నీ ఒక్కొక్కటే గుప్‌న ఆరిపోతున్నాయ్. అదిగో – ఆ మధు మొఖంలో ఎంతో కళో! ఎంతగా ఆనందం చిందులేస్తోందో! ఆ కళ – ఆ ఆనందం తన చెల్లెలికీ పెళ్ళవుతోంటే ఆమె మొఖంలో కూడా ఇలాగే నృత్యం చేస్తుంది కదూ! అప్పుడు అమ్మ మొఖం, పిల్లల మొఖాలూ అన్నీ పున్నమి చంద్రుడ్ని చూసిన కలువల్లా వికసిస్తాయ్ – హసిస్తాయ్... కాని ఆ ఘడియలు వస్తాయా నిజంగా?

అన్యమనస్కంగా లంచ్ చేస్తోన్న అప్పారావు చెవిలో రామనాధంగారు ఈశ్వరయ్యగారితో అంటోన్న మాటలు పడ్డాయ్.

"ఏమైన కాస్త వీలైన సంబంధాలుంటే చూడండీ. మా వాడొకడున్నాడు. మా పిన్ని గారబ్బాయిలే. అంతా పోగుజేస్తే ముప్పై అయిదేళ్ళు కూడా ఉండవ్. మొన్ననే వాడి పెళ్ళాం కారు యాక్సిడెంట్లో పోయింది. వాడూ మనలాగే ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళాన్ని పోషించుకోగలడు. మరీ పెద్ద కట్నం అక్కర్లేదనుకోండి..."

"ఆ కుర్రాడిదేవూరండీ రామనాథంగారూ" అప్పారావు అడిగాడు వాళ్ళ దగ్గరి కెళ్తూ.

"ఏం మీ తరపునేమైన సంబంధాలున్నాయా?"

"మా చెల్లెలికి ఈ ఏడు పెళ్ళి చేసేద్దామనుకుంటున్నామండీ. పెద్ద మనిషై రెండేళ్ళు కూడా కాలేదనుకోండి. కాని మా అమ్మ బతుకుతానో లేదో అంటూ ఒకటే పోరు పెడుతోందండీ"

వాళ్ళకి నిజం తెలీదు కదాని అబద్ధం ఆడేశాడు కాని అతడి చెల్లెలు పదేళ్ళ క్రితమే పెద్దమనిషైనట్టు ఆమెని ఇదివరకే చూసిన వాళ్ళకి తెలుసునని పాపం అప్పారావుకి తెలీదు!

"ఎంత ఆశతో వున్నార్ట?" ఆశగా అడిగాడు.

"నాలుగు మూడువేలను కుంటాను. కనుక్కోమంటే కనుక్కుంటాను"

"కొంచెం కనుక్కుందురూ"

"అలాగే"

అప్పారావు హృదయపు బీడులో మళ్ళీ కొన్ని ఆశలు గబగబా మొలకెత్తాయ్. ఇదివరకు తీసుకున్న పి.యఫ్ లోన్ ఎంచుమించు తీర్చేసినట్టే గనుక మళ్ళీ తీసుకుని చెల్లెలి పెళ్ళి చేసేయాలి. నిజమే ఈ సారి తను తప్పకుండా చేసేస్తాడు. తప్పకుండా తన జాతకం మారుతుంది.

ఆవాళ ఇంట్లో అడుగుపెడుతోంటే "ఈమాత్రం దానికే అంత ఇదవ్వాలా. ఇది గాకపోతే ఇంకోటొస్తుంది గానీ, మరీ అంత నిరాశపడితే ఎలాగా? నిరాశపడి మాత్రం మనం చేయగలిగే దేముంది చెప్పు?..." అంటూన్న భార్య మాటలు విన్పించాయ్.

విషయం ఏమీ అర్థం గాక "ఏమిటే" అన్నాడు అప్పారావు.

"మీ తమ్ముడికి మొన్న వెళ్ళిన ఉద్యోగం రాలేదుట. ఇక నాకీ జన్మలో ఉద్యోగం రాదంటూ ఏడుస్తూ కూర్చున్నాడు"

మైగాడ్! అయితే ఆ ఉద్యోగం పోయిందన్న మాట. పరంధామయ్య గారు– ఎంతో ఆప్యాయంగా మాట్లాడిన పరంధామయ్యగారి రికమండేషన్ చేసుండరూ? లేక చేసినా పనవ్వలేదా? ఏమిటో! పట్టుకున్నదల్లా మట్టవుతోంది. ఏదీ కలిసిరావడం లేదు. తమ గీతెప్పుడు మారుతుందో ఏమో!

తమ్ముడి పక్కన కూర్చుని "వూరుకోరా" అనడం తప్పించి ఇంకేం అనలేక పోయాడు అప్పారావు.

అటు ఆకాశంలోనూ, ఇటు అతడి కళ్ళల్లోనూ ఒకేసారి మెరిశాయి చుక్కలు!

* * *

**(విశ్వరచన 1.10.1978)**